# హృదయంలో ఉన్న బ్రహ్మము స్ఫురించక పోవటానికి కారణం మనలో దోషములే

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-1-2001, ఆకివీడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బ్రహ్మం మన హృదయంలో ఉంది, అదే అంతటా వ్యాపించి ఉంది. బ్రహ్మమే సత్యము. సర్వకాల సర్వావస్థలలో ఈ సృష్టిఉన్నా లేకపోయినా, శరీరాలుఉన్నా లేకపోయినా ఎప్పుడూ చెదరకుండా, కదలకుండా తనంతట తానుగా ఉండేది సత్యం. మనం మాట్లాడుకొనే మాటలు వ్యవహారిక సత్యములు. సత్యం అంటే బ్రహ్మమే. దేవతలకు, అవతార పురుషులకు, జ్ఞానులకు, ఈ సృష్టికంతాకూడా శక్తినిచ్చేది అదే. దాని అనుగ్రహం వలననే మనకు శక్తి కలుగుతుంది. మనం ఎన్ని ప్రవచనాలు శ్రవణం చేసినా, ఎన్ని నదులలో మునిగినా, ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా సత్యం మన హృదయంలోనే ఉంది అనే నిశ్చయం ఈనాటికి కూడా మనకు కలగటం లేదు. ఇది మాయయొక్క ప్రభావము. బ్రహ్మం మన హృదయంలోనే ఉంది అనేది శాస్త్రవాక్యం, మహర్షివాక్యం. అది నూటికి నూరుపాళ్ళు సత్యం. మనకు తెలిసినా, తెలియకపోయినా బ్రహ్మం మన హృదయంలోనే ఉంది. కాని అది మనకు గోచరమవ్వటం లేదు. దానికి మనలోఉన్న దోషములు, బలహీనతలు కారణం. మనలో ఉన్న బలహీనతలు మనలను ఎంతదూరం తీసుకొనివెళ్ళాయి అంటే హృదయంలోఉన్న బ్రహ్మం మనకు తెలియకపోయినా ఫరవాలేదు మన హృదయంలోనే బ్రహ్మం ఉంది అనే గుర్తిపుకూడా రాకుండా చేస్తున్నాయి. అంటే జీవుడు ఎంత పతనమయ్యాడో చూడండి. జీవుడిలోఉన్న దోషాలు వాడి మనస్సును బాహ్యాముఖం చేస్తున్నాయి, లోపల బ్రహ్మం ఉంది అనే గుర్తింపు జీవుడికి రావటంలేదు. రజోగుణం ఉన్నవారు, తమోగుణం ఉన్నవారు ఎంతసేపు ఏదో బరువుమోస్తూ ఉంటారు. వారికి ధనంఉన్నా లేకపోయినా, చదువుఉన్నా లేకపోయినా మనస్సుతో ఏదో కల్పించుకొని ఆ బరువు మోస్తూ ఉంటారు. చనిపోయే వరకు వారికి బరువు మోయటమే పని. మనం సత్వగుణాన్ని ఆశ్రయించాలి. సత్వగుణాన్ని ఆశ్రయించినవాడికి సత్యాన్వేషణ చేయాలనే బుద్ధి కలుగుతుంది.

జ్ఞానధనాన్ని సంపాదించుకో మిగిలినవన్నీ స్వప్న సమానము అని భగవాన్ చెపుతూఉంటే ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. ఎవరైనా తిండిలేకుండా బాధపడుతున్నారు అనుకోండి వారికి సహాయం చెయ్యాలి కదా, అంతేగాని ఇది అంతా స్వప్న సమానము అనుకొని ఏమీ చేయకుండా ఉండటం న్యాయమా అన్నారు. అప్పుడు భగవాన్ ప్లీడరుగారితో నేను చెప్పేది అదికాదు, సరిగా అర్థం చేసుకో. వాడికి అన్నంపెట్టవద్దు అని నేను చెప్పటం లేదు. నీకు నిజం తెలిసినప్పుడు వాడు ఆకలితో బాధపడటం, నీవు వాడికి అన్నం పెట్టటం ఇవి రెండూకూడా స్వప్నం అని నీకు తెలుస్తుంది అంతేగాని ఆకలితో బాధపడేవాడికి అన్నంపెట్టవద్దు అని నేను చెప్పటం లేదు. దేహం ప్రారబ్దమును బట్టి నడుస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. దేహంతోఉన్న తాదాప్యం వదిలించుకోవటానికి ప్రయత్నం

చేస్తూ ఉంటే లోపలున్న సత్యం తళుక్కున మెరుస్తుంది. పూర్వజన్మలో సత్కర్మ చేసిఉంటేగాని, పూర్వజన్మ పుణ్యఫలం ఉంటేగాని నీకు లోచూపు కలుగదు. నీకు లోచూపు కలుగుతూఉంటే శాస్త్రముతో నీకు పనిఏముంది అన్నారు మహర్షి. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గోచరింపచేసుకోవటమే ప్రపంచంలోఉన్న అన్ని మతముల సారము. సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటే నీవు స్వేచ్ఛను పొందుతావు, సంసారచక్రంలోనుండి విడుదల పొందుతావు. ఒక కులానికి, ఒక మతానికి పరిమితమైన మనిషికి ఆధ్యాత్మిక పురోగతి రాదు. లోపలున్న సత్యం ఎవరిని అనుగ్రహిస్తే అది వారికి తెలియబడుతుందిగాని అడిగినవారికి అందరికి అది తెలియబడదు. ప్రతీ మనిషి నేను బుద్ధిమంతుడను అనుకొంటాడు. నువ్వు అనుకొంటే సరిపోదు లోపలున్న సత్యం నీవు బుద్ధిమంతుడివి అని అనుకోవాలి. నేను మంచివాడిని అనుకొనేవాడు ఎవడూ మంచివాడు కాదు. ఎందుచేతనంటే నిజమైన మంచివాడికి వాడిలో మంచితనం ఉన్నట్లుకూడా వాడికి తెలియదు, నేను మంచివాడిని అని వాడు అనుకోడు.

కొంతమంది జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకొని కాలాన్ని పాడుచేసుకొంటారు. కొంతమంది వారికి ఇప్పుడు కష్టం లేకపోయినా ఏదో కష్టం వస్తుంది అని ఊహించుకొంటూ కాలాన్ని పాడుచేసుకొంటారు. సాధకుడికి అదీ పనికిరాదు, ఇదీ పనికిరాదు. చేతిలోఉన్న కాలాన్ని ఉపయోగించుకోవాలి. నీ హృదయంలోఉన్న బ్రహ్మం తప్పించి అన్నీ నీ మనస్సుయొక్క కల్పితములే. నీ హృదయంలోఉన్న బ్రహ్మం సత్యాలకు సత్యం Reality of Realities. దేవుళ్ళు అందరూ సత్యం అనుకొంటున్నారు ఆ దేవుళ్ళందరికి ఆధారంగా ఉన్నది నీ హృదయంలో ఉన్న బ్రహ్మమే. దానికి బంధం లేదు. దానితో నీకు తాదాప్యంవస్తే నీవుకూడా బంధంలేని స్థితికి వెళతావు. సూర్యుడికి వెలుతురును ఇచ్చే శక్తి ఇచ్చేది బ్రహ్మమే. సూర్యుడు చీకటిని చూడలేడు. కాని నీలోపల ఉన్న బ్రహ్మం చీకటినికూడా చూడగలదు. దేనివలన గాలి వీస్తోందో, దేనివలన సూర్యుడు వెలుతురును ఇస్తున్నాడో, దేనివలన చంద్రుడు చల్లదనాన్ని ఇస్తున్నాడో వాడిని పట్టుకో, ఆ శక్తిని పట్టుకో. వాడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావేమో వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. బ్రహ్మం అనుభవంలోనికి వచ్చినప్పుడు దానిని ఎంజాయ్ చేయటానికి నేను ఉండాలికదా అంటారు కొంతమంది. ద్వైత సిద్ధాంతం ఇక్కడే ఉంది. జీవుడు ఉండాలి కదా ఎంజాయ్ చేయటానికి, జీవుడు లేకపోతే ఎవడు ఎంజాయ్ చేస్తాడు అని వారి ఉద్దేశం. బాహ్యంగా ఎంజాయ్ చేయటానికి అలవాటుపడిపోయి ఇటువంటి సందేహాలు వస్తాయి. బ్రహ్మానుభవం కలిగినప్పుడు దానిని అదే ఎంజాయ్ చేస్తూ ఉంటుంది అక్కడ జీవుడితో పనిలేదు. ద్వైతాన్ని అతిక్రమించాలంటే పూర్వజన్మల పుణ్యబలం ఉంటేగాని అది సాధ్యంకాదు. నీవు వేలాది జన్మలలో సత్కర్మ చేసిఉంటేగాని అద్వైతస్థితి నీ చేతికి అందదు. ద్వైతం గురించి, అద్వైతం గురించి భగవాన్ చాలా అందంగా చెప్పారు. నీవు కానిదానితో తాదాప్యం పొందితే అది ద్వైతం, నీవు ఏదైతే అవునో దానితో తాదాప్యం పొందితే అది అద్వైతం. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొనేవాడు జీవుడు. ఎందుచేతనంటే వాడు

దేహానికి పరిమితమై ఉన్నాడు. అటువంటి పరిమితులు నీ హృదయంలో ఉన్న సత్యానికి లేవు. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి. అది దొరికేవరకూ సుఖంకోసం, శాంతికోసం, ఆనందంకోసం బజారులో వెతుక్కొంటూనే ఉంటావు. నిజమైన సుఖం నీ హృదయంలోనే ఉంది. బజారులో నీవు ఏదైనా సుఖాన్ని అనుభవించినా రెట్టింపు దుఃఖం దాని వెనకాలే నీకు వచ్చేస్తుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి.

బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది. నీకు ఎఱుకపడటానికి సదా సిద్ధంగా ఉంది. తోసివెయ్యండి, తోసి వెయ్యండి జన్మజన్మలనుండి మోసుకొని వస్తున్న వాసనలను, సంస్కారములను తోసివెయ్యండి. అప్పుడు హృదయంలోఉన్న వస్తువు తళుక్కున మెరుస్తుంది. వాసనలు బరువైన దుంగలలాగ ఉంటాయి. కేవలము నీ ప్రయత్నమువలన వాటిని గెంటలేవు. గురువు అనుగ్రహం లేకపోతే వాటిని మీరు కదపలేరు. మీరు ప్రయత్నం చేయండి ఎప్పుడో గురువు అనుగ్రహం వస్తుంది, వాటిని బయటకు గెంటివేస్తుంది. అయితే గురువు అనుగ్రహానికి పాత్రులయ్యే పనిచెయ్యండి. నీకు కనిపించి వెళ్ళిపోయే దేవుడు కావాలా, 24 గంటలు నీకూడా ఉండే దేవుడు కావాలా అనేవారు భగవాన్. నీ శరీరంఉన్నా లేకపోయినా, ఈ లోకం కనిపించినా కనపించకపోయినా, నీ బంధువులు, స్నేహితులు నిన్ను విడిచివెళ్ళిపోయినా ఎప్పుడూ సర్వకాల సర్వావస్థలలో నీకూడా ఉండేది బ్రహ్మమే. అది ఎప్పుడూ నిన్ను విడిచిపెట్టదు. విడిచిపెట్టటం ఏమిటి అది నీవై ఉన్నావు. దానికంటే నీవు వేరుగాలేవు. నేను దానికంటే వేరుగా ఉన్నాను అనే భావన, అనే తలంపు విడిచిపెట్టటమే నీ సాధనయొక్క లక్ష్యం. నీ లోపలున్న సత్యవస్తువుకు దేహంతో అణుమాత్రంకూడా సంబంధం లేదు. సత్యవస్తువు తాలుక ఎఱుక జీవం, అదే అమృతస్థితిని కలుగజేస్తుంది. దాని తాలుక మరుపు మరణం రెండూ చెపుతున్నారు, బలవంతం చేయటం లేదు. దేనిని పట్టుకొంటావో నీవే నిర్ణయించుకో.

ప్రపంచంలో ఏ రంగంలో అయినా ఒక మేధావిని తీసుకొని నీవు ఎవరో నీకు తెలుసా అని అడగండి. వాడు తలకాయ వంచుకోవలసిందే. వాడు ఎవడో వాడికి తెలియదు. ఈ విద్యలు అన్నీకూడా మన పొట్ట ఎంత నిజమో అవికూడా అంతే నిజం. విద్యలన్నింటికి రాజు ఆత్మవిద్య అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఏ విద్యను నేర్చుకోవటం వలన నీవు ఎవరో నీకు తెలుస్తుందో అదే ఆత్మవిద్య. నీ హృదయంలోఉన్న వస్తువును ప్రత్యక్షముగా నీ చేతికి పట్టి ఇచ్చేదే నిజమైన విద్య. అదే ఆత్మవిద్య. బ్రహ్మంను తెలుసుకోవటం అంటే బ్రహ్మంగా ఉండటమే. ఆ బ్రహ్మం ఎవరు ? మీరు గుడికివెళ్ళి ఏ దేవుడిని ఆరాధిస్తున్నారో ఆ దేవుడికి దేవుడు. దేవుళ్ళందరికి దేవుడు అయిన వాడిని మీ హృదయంలో పెట్టుకొని గుడులచుట్టూ, గోపురాలుచుట్టూ, నదులచుట్టూ తిరుగుచున్నారు. మనం ఏదైతే కాదో దానిని రోజూ జ్ఞాపకం పెట్టుకొంటున్నాము. వివేకాన్ని పెంచుకోవటం మానివేసి అవివేకాన్ని పెంచుకొంటున్నాము, జ్ఞానాన్ని పెంచుకోవటం మానివేసి అజ్ఞానాన్ని పెంచుకొంటున్నాము. ఏదైతే అవునో దానిని పూర్తిగా మర్చిపోతున్నాము. దానికి సంబంధించిన ఎరుక మనకు లేదు. నీవుకాని దానిని

విడిచిపెడితేగాని నీవు ఎవరో నీకు తెలియదు. కాని దానితో నీకు ఉన్నతాదాప్మ్యాన్ని వైరాగ్యంఅనే గొడ్డలితో నరికితేగాని ఆ తాదాప్మ్యం పోదు. నీవు గృహస్థు ధర్మంలో ఉన్నప్పుడు నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి. అంతవరకే. మనందరము ఒకరోజు పుట్టలేదు, అందరం ఒకరోజు చనిపోము. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని నిర్మలంగా చేసుకొని వెళ్ళిపోవాలి. నీవు ఏదైతే కాదో దానిని నీవు జ్ఞాపకం పెట్టుకొన్నా అది అవ్వవు. నీవు ఏదైతే అవునో దానిని సదా జ్ఞాపకం పెట్టుకోవటం వలన అది నీవు కాబట్టి అది అవుతావు. నీవు కానిదానితో తాదాప్మ్యం పొందుతున్నంత కాలం నీకు చీకటిలోకాలు తప్పవు. విషయజ్ఞానం అంతా సాపేక్షిక జ్ఞానం. అది స్వతంత్రమైనది కాదు. ఈ విషయాలను సేకరించే మనస్సు ఎంత నిజమో అదికూడా అంతే నిజం. ఏదైతే ఉందో దానిని పట్టిఇచ్చేది ఆత్మజ్ఞానం.

దేహం స్మశానానికి వెళ్ళేలోపు అనేక చేదు అనుభవాలు, అనేక తియ్యటి అనుభవాలు రావచ్చు. వస్తే రానియ్యి. ప్రారబ్దంలో ఉన్నప్పుడు నీవు వద్దాన్నా ఆగవు. చేదు అనుభవాలను, తీపి అనుభవాలను రాకుండా నీవు ఆపలేవు, వాటిచేతికి దొరకకుండా చేసుకోగలవు. ఈ అనుభవాలు అన్నీ దేహంతో తాదాప్మ్యం పొందే నేనుకే. ఆ దేహంతో తాదాప్మ్యం తెగిపోయిందనుకో చేదుఅనుభవాలు వచ్చినా, తీపిఅనుభవాలు వచ్చినా నీకు ఏమీ అనిపించదు, నీకు హెచ్చుతగ్గులు రావు. ప్రపంచంలో సుఖాలు, దుఃఖాలు అన్నీ నీకు వచ్చినా నీకు దేహంతో తాదాప్మ్యం లేకపోతే అవి నిన్ను ఏమీ చెయ్యలేవు. అగ్నిహోత్రుడిలో ఉన్న కాల్చేశక్తిని బ్రహ్మం తీసేసుకొంటే అగ్నిహోత్రుడు వలన ఏమీ అవ్వదు. అలాగే దేహంతో ఉన్న తాదాప్మ్యం నీకు పోతే ప్రపంచంలో ఉన్న కష్టాలు అన్నీ నీకు వచ్చినా వాటివలన నీకు ఏమీ నష్టం లేదు, వాటివలన నీ మనస్సుకు ఆందోళన రాదు. ప్రపంచంలో ఉన్న కష్టాలు అన్నీ నీకు వస్తే రానియ్యి, అందులో ఏమీలేదు అది అంతా Dust ఆ కష్టానికి నీవు ప్రాణం పోస్తున్నావు కాబట్టి కష్టం క్రింద నీకు అనిపిస్తోంది. నీకు దేహబుద్ధిలేనప్పుడు ఎన్నికష్టాలు వచ్చినా నీకు ఏమీ అనిపించదు, నీవు గంభీరంగా ఉంటావు, లోతుగా ఉంటావు. నీకు ఏదో జ్ఞాపకాలు కావాలి. నీ మనస్సుకు ఏదో సపోర్టు కావాలి. అందుచేత అనాత్మ విషయాలను జ్ఞాపకం పెట్టుకొనేబదులు చైతన్యానికి, ఆత్మకు సంబంధించిన జ్ఞాపకాలతో జీవించు. నీ మనస్సుతో అరుణాచలాన్ని పట్టుకో. నీ చేతులతో పని చేసుకో. నీవు ఏ పనిచేస్తున్నా నీ లోపలఉన్న అరుణాచలానికి సంబంధించిన ఎరుక విడిచిపెట్టవద్దు. అజాగ్రత్త పనికిరాదు. నిరంతరం భగవంతుని జ్ఞాపకం పెట్టుకోవటం వలన నీవు యోగివి అవుతావు. భగవంతుడు నీకు ఆత్మగా వ్యక్తమవుతాడు. జ్ఞాపకమే చాలు. భగవంతుని జ్ఞాపకం మర్చిపోతే అనాత్మ విషయాలు వచ్చేస్తాయి. అక్కడనుండి బంధం ప్రారంభమవుతుంది. దైవధ్యానం విడిచిపెట్టకు, గురుస్మరణ విడిచిపెట్టకు. అశ్రద్ధ పనికిరాదు, సోమరితనం పనికిరాదు.